సాక్షి సంగారెడ్డి
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



దర్గాగా.. భూ కబ్జా
జిల్లాలోని పలు మండలాల్లో చెరువులు, కుంటలను కబ్జాదారులు వదలడం లేదు.
వివరాలు 8లో ▸



చెరువులు, కుంటల సర్వే
చెరువులు, కుంటల పరిరక్షణ కోసం ఏర్పాటైన కమిటీ సోమవారం సర్వే చేపట్టింది.
వివరాలు 8లో ▸



క్రీడల్లో గెలుపోటములు సహజం
క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు.
వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

ఎస్పీ చెన్నూరి రూపేష్



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి జోన్: ఈనెల 28న నిర్వహించే మెగా జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడి కేసులను పరిష్కరించుకోవాలని ఎస్పీ చెన్నూరు రూపేష్ సూచించారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జాతీయ మెగా లోక్–అదాలత్, సైబర్ నేరాలు, ఎన్.బి.డబ్ల్యూ ఎగ్జిక్యూషన్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వీలైనంత వరకు ఎక్కువ కేసులలో రాజీ కుదిర్చే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఇరు వర్గాలు రాజీపడేందుకు అవకాశం ఉన్న కేసులపై దృష్టి పెట్టాలన్నారు. సైబర్ నేరాలలో మోసపోయిన బాధితులకు త్వరలో డబ్బులు అందేవిధంగా చూడాలని ఆదేశించారు. రూ.25 వేల కంటే తక్కువ కోల్పోయిన కేసులలో లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదు చేసుకొని, ఎఫ్ఐఆర్ లేకుండానే రీ ఫండ్ ప్రక్రియ చేసుకోవచ్చన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సంజీవ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జోగిపేటకు శౌర్య యాత్ర

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణానికి మంగళవారం రాష్ట్ర శౌర్య యాత్ర వస్తుందని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎ.నాగభూషణం తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 1 నుంచి 29 వరకు ఈ యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. జోగిపేట పట్టణంలోని స్థానిక క్లాక్ టవర్ వద్ద ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తెలంగాణ సాయుధ పోరాట వీధి నాటిక, కళాకారుల బృందం కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సింగూరుకు పెరిగిన వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో ఒక గేటును పైకి ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ భాగంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో డ్యామ్‌లోకి సోమవారం వరద నీరు చేరుతోంది. దీంతో 11వ నంబర్ గేటు ఎత్తి దిగువకు 11వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అలాగే..రెండు టర్బయిన్ల ద్వారా 0.5ఎంయూల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 29.9 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగితా నీటిని దిగువకు వదులుతున్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

వర్గల్(గజ్వేల్): నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగించారు. ఆరోతరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ గడువును నవోదయ విద్యాలయ సమితి అక్టోబర్ 7 వరకు పొడిగించిందని వర్గల్ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. 23న గడువు ముగియాల్సిఉండగా, పాలనాపరమైన కారణాల దృష్ట్యా పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఉమ్మడి మెదక్‌జిల్లాలోని అయిదో తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం కావాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: పర్యావరణ పరిరక్షణకు మహిళా సంఘాలు ముందుకు రావడం సంతోషకరమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాకలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని దూరం చేస్తేనే మనుగడ సాగుతుందన్నారు. ప్లాస్టిక్‌తో క్యాన్సర్‌తో పాటు అనేక రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నామన్నారు. ప్లాస్టిక్‌ను మున్సిపాలిటీతో పాటు దుబ్బాక నియోజకవర్గంలో వాడకాన్ని నిషేధిద్దామన్నారు. ఇళ్లలో, ఫంక్షన్‌లలో సైతం ప్లాస్టిక్ గ్లాసులు,ప్లేట్లు వాడకుండా చర్యలు తీసుకుందామన్నారు.మహిళ సంఘాలు కొత్తగా స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో స్టీల్ బ్యాంకుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. స్టీల్ బ్యాంక్ ఏర్పాటుతో ప్లాస్టిక్ వాడకం తగ్గడంతో పాటుగా పర్యావరణ సమతుల్యత పెరిగి ప్రజలు సంపూర్ణ ఆరోగ్యాలతో జీవిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, కౌన్సిలర్ ఆస యాదగిరి, మెప్మా ప్రతినిధులు ఉన్నారు.

పెళ్లికాని రైతుకు మాఫీ ఎలా?

రుణమాఫీపై అధికారుల మల్లగుల్లాలు
- తల్లిదండ్రులతో కుటుంబ నిర్ధారణ చేస్తే రూ.2 లక్షలు దాటుతున్న పంట రుణం
- యాప్‌లో వివరాల నమోదుకు సాంకేతిక సమస్యలు
- కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ ప్రక్రియ

సదాశివపేట మండలానికి చెందిన లక్ష్మణ్ (పేరు మార్చాం) అనే బ్యాచిలర్ రైతుకు ఓ జాతీయ బ్యాంకులో రూ.1.40 లక్షల పంట రుణం ఉంది. కుటుంబ నిర్ధారణ (ఫ్యామిలీ గ్రూపింగ్) జరగలేదనే కారణంగా ఈ రుణం మాఫీ కాలేదు. పెళ్లి కాని లక్ష్మణ్ ఏ కుటుంబంతో గ్రూపింగ్ చేయాలి..? తల్లి దండ్రులతో కలిపి గ్రూపింగ్ చేస్తే వారి పేర్లతో ఉన్న రుణం కలిపితే ఆ కుటుంబం తీసుకున్న రుణం రూ. రెండు లక్షలకు మించి పోతోంది. దీంతో బ్యాచిలర్ రైతులకు పంట రుణ మాఫీ ప్రశ్నార్థకంగా మారింది.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పంట రుణాలు మాఫీకాని రైతుల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు రుణమాఫీ (లోన్ వేవర్) యాప్‌లో నమోదు చేస్తున్నారు. అయితే.. బ్యాచి లర్ రైతుల వివరాలను నమోదు చేయడానికి యాప్‌లో ఆప్షన్ లేకుండా పోయింది. ఈ విషయాన్ని క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే 2012 కంటే ముందు ఆధార్ కార్డులు లేని వారి రైతుల వివరాలను నమోదుకు కూడా యాప్ సపోర్టు చేయడం లేదు. ఇలా యాప్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యల కారణంగా అర్హులైన రైతుల కుటుంబ నిర్ధారణ ప్రక్రియ కొంత ఆలస్యమవుతోంది. కాగా, లోన్‌వేవర్ యాప్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇటీవల ఈ యాప్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలన్నీ పరిష్కరమయ్యాయని ఆ శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పుడు ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తడం లేదని, కుటుంబ నిర్ధారణ ప్రక్రియను సజావుగా సాగుతోందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 64 శాతం పూర్తి

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పంట రుణాలను మాఫీని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఒక్కో రైతు కుటుంబంలో రూ.రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తోంది. తొలి విడత రూ.లక్ష లోపు పంట రుణమున్న రైతులకు సంబంధించి రూ.279.62 కోట్లు మాఫీ చేయగా, రెండో విడతలో రూ.1.50 లక్షల లోపు ఉన్న 27,249 మంది రైతులకు చెందిన రూ.286.76 కోట్లను మాఫీ చేసింది. మూడో విడతలో రూ. రెండు లక్షలలోపు రుణమున్న 16,676 మంది రైతు కుటుంబాలకు సంబంధించి రూ.281.66 కోట్లు మాఫీ అయ్యాయి. అయితే అన్ని అర్హతలుండీ మాఫీ కాని రైతుల సంఖ్య వేలల్లో ఉంది. ఇందులో ఇప్పటికీ పంట రుణం మాఫీ కాని వారిలో సుమారు 21,952 మంది రైతుల వివరాలను కుటుంబ నిర్ధారణ (ఫ్యామిలీ గ్రూపింగ్) చేయాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు 14,105 మంది రైతులకు సంబంధించి కుటుంబ నిర్ధారణ ప్రక్రియ పూర్తయింది. గ్రామాల్లోకి వెళ్లిన వ్యవసాయ అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి సెల్ఫీ దించుతూ కుటుంబ నిర్ధారణ ప్రక్రియను చేపడుతున్నారు. అయితే కొందరు ఇతర దేశాల్లో, రాష్ట్రాల్లో ఉన్న రైతులు, అలాగే హైదరాబాద్ వంటి నగరాల్లో ఉంటున్న రైతులు చాలా మంది గ్రామాల్లోకి రాకపోవడంతో మిగిలిన వారి కుటుంబ నిర్ధారణ ప్రక్రియ చేయలేక పోతున్నామని అధికారులు చెబుతున్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి

రుణాల మంజూరులో జాప్యం వద్దు

- మాఫీ జరిగిన రైతులందరికీ కొత్త రుణాలు
- బ్యాంక్ అధికారులకు కలెక్టర్ క్రాంతి ఆదేశం

సంగారెడ్డి జోన్: జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ జరిగిన రైతులందరికీ కొత్త రుణాలు అందించాలని, రుణాల మంజూరులో జాప్యం చేయడం తగదని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రుణమాఫీలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరికి బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యంగా వహించకుండా కొత్త రుణాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. రైతులకు ఎటువంటి అభ్యంతరాలు పెట్టకుండా కొత్తగా రుణాలు ఇవ్వాలన్నారు. రుణమాఫీ, పింఛన్లు, పంటరుణానికి సంబంధం లేకుండా రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 98,245 మంది రైతులకు రుణ మాఫీ జరిగిందని, వీరిలో 73 514 మంది రైతులు కొత్త రుణాలు తీసుకున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. రుణమాఫీ పొందిన వారిలో ఇప్పటివరకు 75శాతం మందికి కొత్త రుణాలు మంజూరు చేసినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్ రెడ్డి, కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, డీసీఓ కిరణ్ కుమార్, వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

గోమారంలో ఘర్షణ

ఎమ్మెల్యే ఇంటిపై అర్ధరాత్రి దాడి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల వాగ్వాదం.. తోపులాట
- పథకం ప్రకారమే దాడి: ఎమ్మెల్యే

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో వినాయక శోభాయాత్ర సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి తలెత్తిన గొడవ కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరస్పర వాగ్వాదం, తోపులాట జరిగింది. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భగత్‌సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర అర్ధరాత్రి ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటి వద్దకు చేరుకోగానే కొందరు వ్యక్తులు టపాసులు కాల్చుతూ, ఇంటిపైకి ఇటుకలు విసిరారు. ఎమ్మెల్యే ఇంట్లో నిద్రిస్తున్న పలువురు గ్రామ యువకులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకోవడం.. అదే సమయంలో కాంగ్రెస్ నేతలు రావడంతో ఘర్షణకు దారి తీసింది. పోలీసులు ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు.

కాంగ్రెస్ నేతల ప్రోత్సాహంతోనే: సునీత

శోభాయాత్ర సందర్భంగా తన ఇంటిపై జరిగిన దాడిని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఖండించారు. దాడి జరిగిన విషయం తెలియగానే ఆమె స్వగ్రామం గోమారానికి చేరుకున్నారు. ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతోనే తన ఇంటిపై దాడి జరిగిందని ఆమె ఆరోపించారు. దాడిని అడ్డుకోబోయిన తమ పార్టీ కార్యకర్తలపై కూడా దాడి చేశారన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.



ఘర్షణ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

మా ఇంటి వద్ద కూడా హల్‌చల్ చేశారు: కాంగ్రెస్ నేత మాధవరెడ్డి

రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ వర్గీయులు గ్రామంలో నిర్వహించిన వినాయక నిమజ్జనం సందర్భంగా తన ఇంటి ఎదుట కూడా టపాసులు కాలుస్తూ హల్‌చల్ చేశారని కాంగ్రెస్ నేత మాధవరెడ్డి ఆరోపించారు. ఇంటి ఎదుట పార్క్ చేసిన కారుపై టపాసుల మెరుపులు పడి పాడైపోయిందని చెప్పారు. అయితే.. ఈ విషయాన్ని తాను రాజకీయం చేయలేదని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

విచారించి చర్యలు: ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటిపై జరిగిన దాడిపై విచారణ చేపట్టామని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. నివేదిక వచ్చాక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏవైనా గొడవలు జరిగినప్పుడు సంయమనం పాటించాలని, వెంటనే డయల్ 100కు గానీ, పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలని ఆయన సూచించారు. కాగా, బీఆర్ఎస్ నాయకుడు మణిదీప్ ఫిర్యాదు మేరకు నలుగురు కాంగ్రెస్ నేతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, చిత్రంలో పార్టీ నాయకులు

నోటీసులు లేకుండానే కూల్చేస్తాం



అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు..

- ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దు
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ రెడ్డి
- అమీన్‌పూర్‌లో కూల్చివేతలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో సర్వే నంబర్ 993లో ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ తెలిపారు. మొత్తం ఏడు ఇళ్లను కూల్చివేసినట్లు తెలిపారు. సోమవారం ఆ నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ఎలాంటి నోటీసులు అవసరం లేదని వారు స్పష్టం చేశారు. ప్రజలు ఎవరైనా ప్రభుత్వ భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోకూడదని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి జోన్: ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టరు చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టరు మనోజ్, డీఆర్ఓ పద్మజారాణితో కలిసి ఆమె దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ, పింఛన్, ఎక్సైజ్, ధరణి, స్థలాలతోపాటు తదితర సమస్యలపై దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కలెక్టరేట్ కార్యాలయం ఆవరణ అంతా కిటకిటలాడింది.

పట్టా పుస్తకంలో పేరు మార్చాలి

మాది జిన్నారం మండల పరిధిలోని అందూరు గ్రామం. మాకు ఒక ఎకరా రెండు గంటల భూమి ఉంది. అందుకు సంబంధించిన పట్టా పాస్ పుస్తకం ఇతరుల పేరు మీద ఉంది. ధరణి పాసు పుస్తకంలో ఫొటో మహిళ, పేరు పురుషుడితో ఉండి తప్పులతో పాస్ పుస్తకం ఉంది. తప్పుగా ఉన్న పేరు తొలగించి మా పేర్లు నమోదు చేసి పట్టా పాస్ పుస్తకం అందించాలి.

–కమ్మర్ ఉన్నిసా, సుల్తానా, అమీర్ ఉన్నిసా బేగం



దరఖాస్తులు అందించేందుకు క్యూ లైన్ లో వేచి ఉన్న ప్రజలు

బెల్టు షాపులను తొలగించాలి

అందోల్ మండల పరిధిలోని అల్మాయిపేటలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి కల్తీ మద్యం అమ్ముతున్నారు. గ్రామంలో చాలా మంది మద్యానికి బానిసై అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఆర్థికంగా నష్టపోవడంతో పాటు దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు జరుగుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి. –అల్మాయిపేట గ్రామస్థులు

రిక్షా ఇప్పించండి

నాది పెద్ద చేల్మడ మండల పరిధిలోని అంతారం గ్రామం. నాకు నడిచేందుకు ఇబ్బందిగా ఉంది. అందుకు అధికారులు చర్యలు తీసుకొని నాకు రిక్షా ఇప్పించగలరు. –బి.నర్సింలు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం డిమాండ్

సంగారెడ్డి ఎడ్యుకేషన్/జహీరాబాద్ టౌన్/సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, కార్మిక వర్గానికి నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట, జహీరాబాద్ మహీంద్ర, రాకూల్ పరిశ్రమల వద్ద, సదాశివపేట మండల పరిధిలోని ఎంఆర్ఎఫ్, బ్లూ క్రాఫ్ట్ అగ్రో పరిశ్రమల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందని మండిపడ్డారు. 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను హరిస్తుందని చెప్పారు. కార్మికవర్గం ఐక్యంగా పోరాడి కేంద్రానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు నాయకులు బాగారెడ్డి, యాదగిరి, శ్రీధర్, ప్రవీణ్, వెంకట్ రెడ్డి, దేవరాజ్, దయానంద్, శ్రీశైలం, వీరయ్య, అలాగే.. జహీరాబాద్‌లో క్లస్టర్ కన్వీనర్ మహిపాల్, నాయకులు రాజిరెడ్డి, నారాయణ, వంశీ, మహేశ్వర్, సూరి, సదాశివపేటలో నర్సింలు, రాజు, హరికృష్ణ, నందు, సంజీవ్, శాంత కుమార్, శ్రీశైలం, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

26న యోగా శిక్షకుల నియామకానికి ఇంటర్వ్యూలు

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిన యోగా శిక్షకులను నియమించనున్నామని జిల్లా ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా ఈనెల 26న మెదక్ జిల్లా కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్‌లో ఉదయం 10.30 నుంచి 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి అర్హత గల శిక్షకులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని హాజరు కావాలని సూచించారు. మెదక్ (14), సంగారెడ్డి (16), సిద్దిపేట (16) మొత్తం 46 యోగా సెంటర్లు ఉండగా పురుష శిక్షకులు (23), మహిళలు (23) చొప్పున మొత్తం 46 మందిని నియమించనున్నారు.

హామీలు అమలు చేయాల్సిందే

- ఆ తర్వాతే పరిశ్రమలు నెలకొల్పాలి
- వర్గల్ భూనిర్వాసితుల డిమాండ్
- పరిశ్రమల ప్రాంతంలో ఆందోళన

వర్గల్(గజ్వేల్): ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్ కోసం భూసేకరణ జరిపిన ప్రభుత్వం, హామీలను పూర్తిస్థాయిలో అమలుచేసిన తరువాతే పరిశ్రమలు నెలకొల్పాలని వర్గల్ భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. సోమవారం వర్గల్ శివారులోని పరిశ్రమల ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించి వారు ఆందోళన జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమల పేరిట 1495, 1510 సర్వేనంబర్లలో భూసేకరణ చేశారన్నారు. ఈ సందర్భంగా తమకు ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయలేదన్నారు. భూములు కోల్పోయిన కొందరు రైతులకు నష్టపరిహారం, ఇండ్ల పట్టాలు ఇవ్వలేదని, రెవెన్యూ అధికారులు సమగ్రసర్వే జరిపి న్యాయం చేయాలన్నారు. హామీకి అనుగుణంగా ప్రతి ఒక్కరికి ప్లాట్లు, ప్యాకేజీలు పూర్తిస్థాయిలో అందించిన తరువాతే పరిశ్రమల నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



వర్గల్ పరిశ్రమల ప్రాంతంలో నిరసన వ్యక్తం చేస్తున్న భూనిర్వాసితులు

మెరిట్ ఆధారంగా బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ

కౌడిపల్లి(నర్సాపూర్): మెరిట్ ఆధారంగా బ్యాక్‌లాగ్ సీట్లు భర్తీ చేస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలల ఆర్‌సీఓ (రీజినల్ కోఆర్డినేటర్) సంతోషి తెలిపారు. సోమవారం తునికి వద్ద గల గురుకుల పాఠశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్ సరళిని పరిశీలించారు. ఆమె మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 29 బాలబాలికల పాఠశాలలోని 5, 6, 7, 8వ తరగతుల్లో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ సీట్లను మెరిట్ ఆధారంగా భర్తీ చేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా

చెరువులు, కుంటల సర్వే

- బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ ప్రాంతాల గుర్తింపు
- భయాందోళనలో ప్రజలు


సర్వే చేపడుతున్న అధికారులు

తూప్రాన్: మండలంలోని చెరువులు, కుంటల పరిరక్షణ కోసం హెచ్ఎండీఏ అధికారులు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కమిటీ సోమవారం సర్వే చేపట్టింది. ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన అక్రమాలను తొలగిస్తున్న నేపథ్యంలో హెచ్ఎండీఏ పరిధిలో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసులతో ఓ కమిటీని నియమించింది. ఈ క్రమంలోనే పట్టణ పరిధిలోని రావెల్లి, పోతరాజుపల్లి, అల్లాపూర్, బ్రహ్మణపల్లి తదితర గ్రామాలతోపాటు పట్టణంలోని కుంటలు, చెరువు పరిధిలోని ప్రాంతాలను సర్వే చేపడుతున్నారు. హైదరాబాద్ పరిధి జీహెచ్ఎంసీలోనే అక్రమ కట్టడాల కూల్చివేతలు ఉంటాయా? లేదా హెచ్ఎండీఏ పరిధిలోనూ కూల్చివేతలు చేపడుతారా? అనే సంశయంతో ఈ ప్రాంతాల్లో కట్టడాలు చేపట్టిన వారు ఆందోళన చెందుతున్నారు.

నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ముఠాలో పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. 10న పొన్నాల శివారులో గంజాయి విక్రయిస్తున్న యువకులను పట్టుకున్న కేసులో నలుగురు పట్టుబడగా ఇద్దరు పరారీలో ఉన్న విషయం తెలిసిందే. పరారీలో ఉన్న నిందితుల్లో ఒకడైన అర్బన్ మండలం మిట్టపల్లికి చెందిన పర్కపల్లి ప్రణయ్‌ను గ్రామంలోనే ఉన్నాడని సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. వారి ని చూసి నిందితుడు పారిపోవడానికి ప్రయత్ని ంచగా వెంబడించి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.700 విలువైన 21.52 గ్రాముల నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

మద్యం పట్టివేత

జహీరాబాద్ టౌన్: అక్రమంగా మద్యాన్ని హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 65వ జాతీయ రహదారిపై రాష్ట్ర సరిహద్దులో ఉన్న చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఓ బస్సులో గోవా నుంచి తీసుకొస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.40వేలు ఉంటుందన్నారు. ఈ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మిల్లుల్లో రికార్డులు తప్పనిసరి


మాట్లాడుతున్న దేవీలాల్

జహీరాబాద్ టౌన్: కలప కోత మిల్లుల నిర్వాహకులు రికార్డులను నిర్వహించాలని జహీరాబాద్ ఫారెస్టు అధికారి దేవీలాల్ సూచించారు. సోమవారం అటవీ శాఖ కార్యాలయంలో సా మిల్లుల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సా మిల్లుల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. కలప అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడూ రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. నిషేధిత చెట్లను నరికించొద్దని తెలిపారు. అటవీ శాఖ అనుమతులకు సంబంధించిన పత్రాలను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. రెన్యూవల్ చేసుకోకుండా పనులు చేపడితే చర్యలు తప్పవన్నారు. అటవీ శాఖ నిబంధనలు అతిక్రమిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.

దర్జాగా.. భూ కబ్జా

జిల్లాలో ఆక్రమణకు గురవుతున్న చెరువులు, కుంటలు

- నిర్మాణాలు చేపడుతున్న అక్రమార్కులు
- ఎకరాలకు ఎకరాలు మాయం
- పట్టించుకోని అధికారులు
- హైడ్రా తరహా వ్యవస్థ తీసుకురావాలని కోరుతున్న స్థానికులు


కొల్చారం మండలం కొత్త చెరువును ఆక్రమించి అచ్చుకట్టిన ఆక్రమణదారు

మెదక్ కలెక్టరేట్ : జిల్లాలోని పలు మండలాల్లో చెరువులు, కుంటలను కబ్జాదారులు వదలడం లేదు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు.. గద్దల్లా వాలిపోతున్నారు అక్రమార్కులు. రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేస్తూ నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. హైదరాబాద్ పరిసరాల్లో చేపడుతున్న హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలో కూడా తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలోని చెరువులన్నీ కబ్జా..

మెదక్ పట్టణ నడిబొడ్డున గల మల్లం చెరువు, ఏదుల్లా చెరువు, పిట్లం చెరువు, గోసముద్రం చెరువు, బంగ్లా చెరువులు సైతం కబ్జాకు గురైనట్లు ఆరోపణలున్నాయి. ఒక్క మల్లం చెరువును కబ్జా చేసి సగం వరకు ఇళ్లు నిర్మించారు. 31 ఎకరాలు ఉన్న చెరువు 15 ఎకరాలు కబ్జాకు గురైనట్లు సమాచారం. అలాగే పట్టణంలోని ఏదుల్లా చెరువు 17 ఎకరాల విస్తీర్ణం ఉండగా ఇప్పటికే 3 ఎకరాలు కబ్జాకు గురైంది. ఇందులో యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారు. గతంలో ఓ వ్యక్తి చెరువు శిఖం భూమి ఆక్రమించి నిర్మాణం చేపట్టగా ప్రస్తుతం అందులో మైనార్టీ కళాశాల కొనసాగుతుంది. కొంత భాగాన్ని తెలంగాణ క్రీడా ప్రాంగణానికి కేటాయించారు. అలాగే, పట్టణంలోని పిట్లం చెరువు సైతం దాయర రోడ్డులో, సినీ మ్యాక్స్ థియేటర్ ఎదుట కబ్జాకు గురైనట్లు ఆరోపణలున్నాయి.

ఆరు కుంటలు మాయం

చేగుంట మండలానికి ఆ పేరు తీసుకొచ్చిన ఆరు గుంటలు ప్రస్తుతం కబ్జాకు గురయ్యాయి. ఒక్కో గుంట సుమారు 6 ఎకరాల మేరా ఉంటుంది. ఇందులో 3 గుంటలు పూర్తిగా కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. మరో మూడు గుంటలు సగం మేర కబ్జాకు గురయ్యాయి. ఈ మండలం సైతం జాతీయ రహదారికి ఆనుకొని ఉండగా అత్యధికంగా పరిశ్రమలు ఉన్నాయి. దీంతో ఇక్కడి భూములకు మంచి డిమాండ్ ఉంది. రూ.కోట్లలో ధర పలుకుతుంది. దీంతో అక్రమార్కులు రాజకీయ నాయకుల అండతో చెరువు కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

రూ.కోట్ల విలువ చేసే భూములు

జిల్లాలో హైదరాబాద్-నిజామాబాద్ ప్రధాన జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న మనోహరాబాద్ మండలంలోని ప్రభుత్వ భూములు, చెరువు కుంటలు ఎకరాల్లో కబ్జాకు గురయ్యాయి. ఈ ప్రాంతంలో భూముల ధరలు రూ.కోట్లలో పలుకుతుండటంతో ఆక్రమణదారులు యథేచ్ఛగా కబ్జా చేసి విక్రయిస్తున్నారు. ప్రధానంగా కాళ్లకల్ గ్రామంలో గల ఎల్లారెడ్డి కుంట, గార్లకుంట, మామిడి కుంట, మాదన్నకుంటలు, మనోహరాబాద్‌లో సాయికుంట, రామాయపల్లిలో ఊరు చెరువు, ముప్పిరెడ్డిపల్లిలో రోడ్డు కుంటలు కబ్జాకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ చెరువుల్లో సుమారు 11 ఎకరాల మేరకు ఆక్రమణకు గురైంది.

108 ఎకరాలు..

కొల్చారం మండలం రంగంపేటలోని తోల్లవాని కుంటను రెండు వైపులా ఆక్రమించి వెంచర్లు ఏర్పాటు చేశారు. ఇదే గ్రామంలోని తుర్కలచెరువు 138 ఎకరాలు కాగా ఆక్రమణలకు గురై 30 ఎకరాలు మిగిలింది. కొత్త చెరువు విస్తీర్ణం 78 ఎకరాలు కాగా, ప్రస్తుతం 20 ఎకరాలకు చేరింది. రాజకీయ నాయకుల అండతో అక్రమార్కులు అడ్డగోలుగా ఆక్రమించేస్తున్నారు. ఆక్రమణలపై చర్యలు చేపట్టాల్సిన ఇరిగేషన్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.


క్రీడాకారులతో డీఐఈఓ, ప్రిన్సిపాల్, పీడీలు, అధ్యాపకులు

క్రీడల్లో గెలుపోటములు సహజం

- డీఐఈఓ రవీందర్‌రెడ్డి
- ఎస్‌జీఎఫ్ అండర్ 19 కబడ్డీ పోటీలు ప్రారంభం

సిద్దిపేటఎడ్యుకేషన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్ 19 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. కరోనా సమయంలో శారీరక, మానసిక దృఢత్వం కలిగిన వ్యక్తులు తొందరగా కోలుకున్నారని చెప్పారు. క్రీడాకారులు తమ ప్రతిభను క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో క్రీడాకారులకు 2 శాతం రిజర్వేషన్ లభిస్తున్నట్లు తెలిపారు. గతేడాది జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో 42 మంది, జాతీయ స్థాయిలో 14 మంది క్రీడాకారులు వివిధ క్రీడల్లో రాణించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కబడ్డీ పోటీలకు 24 జట్లు హాజరయ్యారన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు కనకచంద్రం మాట్లాడుతూ.. గతంలో ఈ క్రీడలను పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగేవని, అధికారులు, నాయకుల ప్రత్యేక కృషితో ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్ క్రీడాకారులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్లం యాదవ్, జిల్లా సహాయకులు వెంకటేశ్, విజయ్‌కుమార్, ఆయా కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా ఇన్‌చార్జిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

సోమవారం ఒక్కరోజే వేర్వేరు చోట్ల నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. చేగుంటలో ఆర్థిక ఇబ్బందులతో యువకుడు, కొండపాకలో మనస్తాపంతో ఒకరు, అనారోగ్యంతో మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు. కల్హేర్‌లో వివాహిత ఉరేసుకొని చనిపోయింది.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..


వెంకటేశ్ (ఫైల్)

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రమైన మాసాయిపేట గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గౌటి వెంకటేశం(35) తండ్రి పోచయ్య గతంలో మృతి చెందగా ఆటో నడుపుకుంటూ తల్లి లింగవ్వతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతోపాటు ఒంటరితనంతో బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంకటేశం ఉరి వేసుకున్నాడు. సోమవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకొని వివాహిత..

కల్హేర్(నారాయణఖేడ్): ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిర్గాపూర్ మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు.. కిషన్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ జనబాయి(35) భర్త నాందేవ్ కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. భార్యపై అనుమానంతో ప్రతి రోజూ వేధింపులకు గురి చేశాడు. వేధింపులు భరించలేని జనబాయి ఆదివారం సొంత వ్యవసాయ భూమి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రాథోడ్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మనస్తాపంతో యువకుడు


శ్రీకాంత్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం గ్రామానికి చెందిన తుడుము ఆశయ్య ఇద్దరు కుమారుల్లో చిన్న కుమారుడు శ్రీకాంత్(22) నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. రెండు నెలలుగా పనికి వెళ్లకుండా గ్రామంలో జులాయిగా తిరుగుతున్నాడు. ఖాళీగా ఉండే బదులు పని వెళ్లమని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ వృద్ధుడు

కొండపాక(గజ్వేల్): అనారోగ్యంతో బాధపడుతూ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కుకునూరుపల్లి మండలంలో చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. పీటీ వెంకటాపూర్ గ్రామానికి చెందిన కడవేర్గు నర్సయ్య (80) కొన్నేళ్ల కిందట భార్య చనిపోగా, అప్పటి నుంచి అనారోగ్యానికి గురై బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం కొడుకు శ్రీనివాస్, కోడలు కనకవ్వ కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్లారు. ఇంటి వద్ద ఒక్కడే ఉన్న నర్సయ్య ఆరోగ్యం సరిగా లేదని మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు అదృశ్యం

కల్హేర్(నారాయణఖేడ్): యువకుడు అదృశ్యమైన ఘటన సిర్గాపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన మచ్కూరి శేఖర్(32) ఇటీవల మద్యం తాగడం మానేయడంతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున నిద్రలేచి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. యువకుడి సోదరుడు విఠల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జహీరాబాద్‌లో మహిళ

జహీరాబాద్ టౌన్: మహిళ అదృశ్యమైన ఘటన జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్ఐ.శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు.. కోహీర్ మండలంలోని సజ్జాపూర్‌కు చెందిన లక్ష్మి భర్త నరేందర్‌తో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. 18న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం భర్త ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వ్యక్తి అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తెల్లాపూర్‌లో నివా సం ఉండే ప్రశాంత్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. 14వ తేదీన డ్రైవింగ్ పని మీద రెండు రోజులు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దేశంలో వనరులున్నా అభివృద్ధి లేదు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

హుస్నాబాద్: భారత దేశంలో అనేక వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ దేశంలో నిరుద్యోగంతో యువత, పేదరికంతో ప్రజలు అల్లాడిపోతున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. కమ్యూనిస్టు దేశమైన వియత్నాం స్టడీ టూర్ పర్యటన ముగించుకొని సోమవారం సీపీఐ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా పట్టణంలోని పలువురు ప్రముఖులు చాడను సన్మానించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి పాలకులు చిత్తశుద్ధితో పని చేస్తే ఎప్పుడో బాగుపడేదన్నారు. పాలకుల మూలంగానే దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నదేశమైన వియత్నాం అభివృద్ధి చెందిందన్నారు. దేశంలో నిరుద్యోగ నిర్మూలన చేయాలనే ఉద్దేశ్యంతో నేటి యువత ముందుండి ప్రజా పోరాటాలకు సన్నద్ధం కావాలని చాడ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, సినీ రచయిత తైలం మురళీ, మధు, ట్రస్మా నాయకులు నారాయణ రెడ్డి, నర్సింహా రెడ్డి. రాజేందర్, చిట్టి గోపాల్ రెడ్డి, రిటైర్డ్ ఎంపీడీఓ కైలాసం, సీపీఐ నాయకులు సంజీవ రెడ్డి, బాలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గురుకుల పని వేళల్లో మార్పు చేయాలి

ప్రజావాణిలో వినతిపత్రం అందజేత


డీఆర్‌ఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

సిద్దిపేటరూరల్: గురుకుల పాఠశాల్లోని విద్యార్థుల మానసిక వికాసానికి తగిన విధంగా ఉండేలా పని వేళల్లో మార్పు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొప్పెట్ల యాదగిరి అన్నారు. సోమవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల పని వేళలు మార్చాలని కోరుతూ ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పనివేళలు విద్యార్థులపై మానసిక ఒత్తిడి , పౌష్టికాహార లోపం శారీరక వ్యాయామం లోపం వంటి రుగ్మతలకు దారితీస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల పనివేళలను నిర్ణయిస్తూ జీఓ నంబర్ 16తో ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ పని వేళలు శాస్త్రీయంగా లేవని, విద్యార్థులపై ఒత్తిడి పెంచేలా ఉన్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం పనివేళలను విద్యార్థులకు అనుగుణంగా సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ గురుకులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, సాంఘీక సంక్షేమ గురుకులాల కన్వీనర్ కృష్ణ, నాయకులు బాబురావు, జిశాంత్ అహ్మద్, శ్రీనివాస్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించండి

జిల్లా వ్యవసాయాధికారి రాధిక


మాట్లాడుతున్న రాధిక

కొండపాక(గజ్వేల్): ఆధునిక పద్ధతులతో వ్యవసాయం సాగేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి రాధిక పిలుపునిచ్చారు. కుకునూరుపల్లి రైతు వేదికలో నీటి సంరక్షణ, యాజమాన్యంపై వ్యవసాయ విస్తరణ అధికారులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంగడాల తయారీ పరిశోధన సంస్థ ఏర్పాటు చేసే శిక్షణ తరగతులు రైతులు ఆధునిక సాగుకు ఆకర్షితులను చేసేందుకు దోహదపడుతుందన్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యేలా గ్రామాల్లో అవగాహన తరగతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాణిజ్యం, కూరగాయాల, పూల తోటల సాగు పంటల సాగు రైతులకు తుంపర, బిందు సేద్యం పరికరాలను సబ్సిడీపై అందిస్తామన్నారు. బిందు సేద్యం సాగులో ఖర్చు, శ్రమ తక్కువగా ఉంటూ ఎక్కువ విస్తీర్ణం సాగుతోపాటు ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. శిక్షణ కార్యక్రమం రెండు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గోవిందరాజుతోపాటు అధికారులు సునీత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి ఇనుప స్టాండ్ల కోసం వెళ్లి..

– చెరువులో మునిగి వ్యక్తి మృతి

మెదక్ మున్సిపాలిటీ: చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మెదక్‌లో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో నివాసం ఉండే లాజు సింగ్(30) పాత ఇనుప సామగ్రి అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్యాపిల్లలు లేకపోవడంతో అన్న అజిత్ సింగ్ వద్ద ఉంటున్నాడు. ఇటీవలె మెదక్ పట్టణంలోని గోసముద్రం చెరువులో పలు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. వాటికి కింది భాగంలో ఇనుప స్టాండ్లు ఉండగా తీసుకురావడానికి లాజుసింగ్ చెరువులోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి అన్న అజిత్ సింగ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు మహిళలు అరెస్ట్

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వారి కథనం మేరకు.. బొల్లారం వైఎస్ఆర్ కాలనీలో ఇద్దరు మహిళలు ఎండు గంజాయిని విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు సోమవారం రాత్రి దాడులు నిర్వహించి ఇద్దరు మహిళల వద్ద 9.8 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

తూప్రాన్: ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నర్సంపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. నర్సంపల్లి గ్రామానికి చెందిన నల్ల గణేశ్(52) కుటుంబ కలహాలతో 19న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానికంగా ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నిజామాబాద్ జిల్లా మద్నూర్ మండలానికి చెందిన గజ్జల్వార్ యాదవ్ (22) కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా శేరిలింగంపల్లి పరిధిలోని మదీనాగూడలో ఓ వ్యక్తి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున గజ్జల్వార్ యాదవ్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి లింగంపల్లి వైపు వస్తున్నాడు. రామచంద్రాపురం పట్టణంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై వేగం వస్తూ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన యాదవ్‌ను స్థానికులు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

మెదక్ మున్సిపాలిటీ: కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలైన ఘటన మెదక్ పట్టణంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ పట్టణంలోని గోల్కొండ వీధికి చెందిన కర్రోళ్ల పోచమ్మ స్థానికంగా మెదక్ ఆర్థోపెడిక్ ఆస్పత్రిలో స్వీపర్‌గా పని చేస్తుంది. ఆదివారం రాత్రి పనులు ముగించుకొని ఇంటికి వెళ్దామని బయటకు వచ్చి రోడ్డు పక్కన నిలబడింది. ఇదే సమయంలో వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోచమ్మకు తీవ్ర గాయాలు కాగా స్థానికంగా ఓ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి బంధువులు కారు డ్రైవర్ పై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందజేయగా కేసు నమోదు చేశారు.


ఘాటెక్కిస్తున్న ఉల్లి

- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.85
- కొనాలంటే జంకుతున్న ప్రజలు


సంతలో ఉల్లిగడ్డల విక్రయాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : అన్ని వంటకాల్లో వాడే ఉల్లిగడ్డ ధరలు రోజురోజుకూ పెరగడంతో ఉల్లిగడ్డ ప్రియులు వాటిని కొనాలంటేనే ఉలిక్కిపడుతున్నారు. ఒక్కసారిగా ఉల్లిగడ్డ ధరలు పెరగడంతో ప్రజలు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం హోల్‌సెల్‌లో చిన్న ఉల్లిగడ్డ ధర కిలో రూ.50, పెద్ద ఉల్లిగడ్డ కిలో రూ.70 ఉండగా బయట మార్కెట్‌లో కిలో రూ.85 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. ధరలు పెరగడంతో చాలా మంది ఉల్లి జోలికి పోవడంలేదు. ప్రధానంగా హోటల్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో ఆహారంతోపాటు ఉల్లిగడ్డలను ఇస్తుంటారు. ధరలు పెరగడంతో దాని స్థానంలో కీరాను అందిస్తున్నారు. ఎక్కువగా ఉల్లిగడ్డలు మహారాష్ట్రలోని సోలాపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ నుంచి దిగుమతి అవుతున్నాయి. ధరలు పెరగడంతో కూరగాయల వ్యాపారస్తులు కొద్దిరోజులుగా ఉల్లిగడ్డలను అమ్మడంలేదు. దాని వల్ల తమకు నష్టమే తప్ప లాభం రావడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వ్యాపారస్తులు ఉల్లిగడ్డలను బ్లాక్ మార్కెట్ చేయడం వల్లే ధరలు పెరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మరికొందరు ప్రభుత్వం ధరలను నియంత్రించలేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. వేసవిలో ఉల్లి ధర కిలో రూ.15 నుంచి రూ.18 వరకు ఉండేది. దానికి కారణం అదే సమయంలో ఉల్లి పంట రావడం వల్ల ధరలు తక్కువగా ఉంటాయని కూరగాయల వ్యాపారస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పూర్తిస్థాయిలో ఉల్లిగడ్డ ధరలను నియంత్రించలేకపోతే పేదవాడు ఉల్లిఘాట్‌కు దూరంకావాల్సివస్తుంది.

ధరలను తగ్గించండి



ఉల్లిగడ్డ ధరలు పెరగడంతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతీ వంటలో ఉల్లిగడ్డలను వాడుతాం. వీటిని తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. ధరలను తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేయాలి.

– లక్ష్మీగౌరమ్మ, భారతీనగర్ డివిజన్

ఎవరూ కొనడంలేదు



కొద్ది రోజులుగా ఉల్లిగడ్డలు పెరగడంతో ప్రజలు కొనడం లేదు. దీంతో నష్టాలు వచ్చి ఇబ్బంది పడుతున్నాం. చాలా మంది కూరగాయ వ్యాపారస్తులు ఉల్లిగడ్డలను అమ్మడం మానేశారు.

– నాగరాజు, వ్యాపారి